క్లుప్తంగా

పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని ప్రైవేట్, ప్రభుత్వ కళాశాల, పాఠశాలలో పీడీఎస్‌యూ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా గురువారం విద్యార్థులకు సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, ఏరియా అధ్యక్షుడు నిఖిల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల, పాఠశాలలో ప్రభుత్వం మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాజు, వినయ్, కార్తీక్, పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



పెర్కిట్(ఆర్మూర్) : ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం తెనుగు పెద్దవ్వ(102) అనే శతాధిక వృద్ధురాలు అనారోగ్య సమస్యలతో మృతి చెందింది. వృద్ధురాలి మృతిపై గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. పెద్దవ్వకు ఒక కుమారుడు గంగాధర్, కోడలు గంగు ఉన్నారు. వారి కి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అలాగే మునిమనవలు ఏడుగురు ఉన్నారు. ఆ లూర్‌లో గురువారం నిర్వహించిన అంత్యక్రియల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఎస్పీ పట్టణ నూతన అధ్యక్షుడిగా మహమ్మద్



బోధన్ : బహుజన సమాజ్ పార్టీ పట్టణ నూతన అధ్యక్షుడిగా షేక్ మహమ్మద్‌ను నియమాకమయ్యారు. గురువారం పట్టణ కేంద్రంలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌కృష్ణ, ప్రతినిధి నీరడి ఈశ్వర్, జిల్లాఅధ్యక్షుడు సింగాడే పాండు ఆయనకు నియమాకపత్రాన్ని అందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల హక్కుల కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.

బీజేపీలో చేరిక



బోధన్ : సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బూరే శంకర్,ఆయనతో పాటు పులి ఆంజనేయులు, బూరే పరుశురాం బీజేపీలో చేరారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్ రెడ్డి కండువా కప్పి వారిని పార్టీలో ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుభా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి



రుద్రూర్ : విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, విద్యుత్ భద్రత సూచనలు పాటించాలని రుద్రూర్ ఏడీఈ తోట రాజశేఖర్ పేర్కొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు విద్యుత్ భద్రత సూచనలను ఆయన వివరించారు. నాణ్యమైన ఐఎస్ఐ మార్కు గల వస్తువులను వాడాలని సూచించారు. పొతంగల్ మండల ట్రాన్స్‌కో ఏఈ ఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ పే డబ్బుల తిరిగి చెల్లింపు



ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్‌కు చెందిన విజయలక్ష్మి తనకు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాలని తన స్నేహితులకు తెలిపింది. దీంతో స్నేహితురాలు విజయలక్ష్మి ఫోన్ పే నంబర్‌కు బదులు ఆర్మూర్‌కు చెందిన నూతుల సత్తమ్మ ఫోన్ పేకు రూ. 66వేలు వెళ్లాయి. దీంతో విజయలక్ష్మి ఆర్మూర్‌కు వచ్చి ఏసీపీ వెంకటేశ్వరెడ్డిని సంప్రదించింది. దీంతో ఏసీపీ సత్తమ్మకు సమాచారం అందించి పిలిపించగా సత్తమ్మ విజయలక్ష్మికి సంబంధించిన రూ. 66వేలు తిరిగి చెల్లించింది. దీంతో ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి సత్తమ్మను అభినందించి సన్మానించారు.

కొనుగోళ్ల ప్రారంభం ఇంకెప్పుడో..?

- జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న సోయా పంట కోత
- చేతికొస్తున్న దిగుబడులు.. వెంటాడుతున్న వర్షం
- కొనుగోలుకు దళారుల రంగ ప్రవేశం



సాలూర కొనుగోలు కేంద్రం స్థలంలో ఆరబెట్టిన సోయాను మళ్లీ కుప్ప పోస్తున్న ఓ రైతు కుటుంబీకులు

బోధన్ : బోధన్ రెవెన్యూ డివిజన్‌లో వారం రోజుల నుంచి సోయా పంట కోత ప్రారంభమై ముమ్మరంగా సాగుతోంది. పంట దిగుబడులు రైతుల చేతి కొస్తున్నాయి. సోయా కొనుగోళ్ల కేంద్రాల వైపు రైతులు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సోయా క్వింటాల్‌కు రూ.5,328 మద్దతు ధర ప్రకటించింది. ప్రతి ఏటా నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా)రైతుల నుంచి సోయా సేకరణకు రాష్ట్ర మార్క్‌ఫెడ్‌కు అప్పగిస్తోంది. మార్క్‌ఫెడ్ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరిస్తోంది. పంట దిగుబడి చేతి కొస్తున్న పరిస్థితిలో సొసైటీల్లో ఎప్పుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు. రైతుల నిస్సహాయ స్థితిని పసిగట్టి దళారులు సోయా కొనుగోలుకు రంగ ప్రవేశం చేశారు. క్వింటాల్‌కు రూ.4,200 కొంటామని బేరం ఆడుతున్నారని తెలుస్తోంది. మార్క్‌ఫెడ్ నుంచి అనుమతి మేరకు కొనుగోలు మొదలు పెడుతామని సొసైటీల సీఈవోలు అంటున్నారు. ఎప్పుడు అనుమతి వస్తోందో తెలియని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 30 వేలకు పైగా సోయా సాగు..

జిల్లాలో 30వేల ఎకరాలకు పైగా సోయాసాగైనట్టు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పోతంగల్, సాలూర, బోధన్ ,రెంజల్ మండలాల్లో సుమారు 20 వేల ఎకరాలకు పైగానే అత్యధిక విస్తీర్ణంలో సాగుచేశారు. సాలూర, బోధన్, రెంజల్ మండలాల్లో భారీ వర్షాలు, వరదల వల్ల 9 వేల ఎకరాల వరకు సోయాకు పూర్తిగా నష్టం వాటిల్లింది. మరో వైపు నూర్పిడి చేసిన సోయా దిగుబడులను ఆరబెడుతున్న క్రమంలో రోజు వర్షం కురుస్తోంది. దీంతో వర్షం భయంతో రైతులు ఆందోళనకుగురి అవుతున్నారు.గరిష్టంగా ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ సారి దిగుబడులు ఆశాజనకంగా కనిపించడం లేదు. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



నేను రెండున్నర ఎకరాల్లో సోయా సాగు చేశాను, నాలుగు రోజుల క్రితం కోత పూర్తయింది. వచ్చిన దిగుబడిని సొసైటీ కొనుగోలు కేంద్రం స్థలంలో ఆరబెట్టాను. ప్రతి రోజు వర్షం కురియడంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. మార్కెట్లో ధర లేదు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే మేలు జరుగుతోంది.

– చిన్న పోతన్న, రైతు, సాలూర

18 ఎకరాల్లో సాగు చేశాను



నేను సొంతం 2 ఎకరాలు, 16 ఎకరాల కౌలు భూమిలో సోయా సాగు చేశాను. పంట కోత పూర్తయింది. ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ సారి భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం.కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఎదురు చూస్తున్నా.

– సంగెపు భూమయ్య, సోయా రైతు, సాలూర

నాఫెడ్ అనుమతి ఇంకా రాలేదు

నాఫెడ్ నుంచి ఇప్పటి వరకు సోయా సేకరణకు అనుమతిరాలేదు. అనుమతి రాగానే కొనుగోళ్లను ప్రారంభిస్తాం.

– మహేష్ కుమార్, డీఎం మార్క్‌ఫెడ్, నిజామాబాద్

ఆరబెట్టలేక ఆందోళనలో రైతులు

బాల్కొండ : బాల్కొండ ఉమ్మడి మండలంలో సోయా పంట కోత దశకు చేరుకుంది. కోత కోద్దామంటే వర్షం భయం అన్నదాతలను వెంటాడుతుంది. అలాగే ఉంచుదామంటే నిలువుగా మొలకెత్తుతుంది. దీంతో సోయా రైతులు తీవ్ర సతమతమవుతున్నారు. దీంతో వ్యాపారులు ధరను భారీగా తగ్గిస్తున్నారు, క్వింటాల్‌కు రూ.4 వేలు పలికిన సోయా పంటను వర్షాలతో క్వింటాల్‌కు రూ. 3600 నుంచి 3800 కు తీసుకువచ్చారు.



నాగంపేట్‌లో రంగు మారిన సోయాలు

కోద్దామంటే భయమేస్తుంది

సోయ పంటను కోత కోద్దామంటే భయమేస్తుంది. వర్షం కురిస్తే నలుపు రంగు మారుతున్నాయి. వెంటనే మొలకెత్తుతాయని భయంగా ఉంది. కోయ కుండా అలాగే ఉంచిన నిలువున మొలకలు వస్తున్నాయి. దీంతో పంట చేతికందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నాం.

– ముత్యంరెడ్డి, నాగంపేట్, రైతు

కాంగ్రెస్‌లో చేరిన రిటైర్డ్ ఎంవీఐ



పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉట్నూరు సుభాష్

వేల్పూర్ : వేల్పూర్ మండలం లక్కోర గ్రామానికి చెందిన రిటైర్డ్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉట్నూరు సుభాష్ గురువారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు పీసీసీ అధ్యక్షుడు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల నాయకుడు సుభాష్ కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షణీయమన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్‌బిన్ హందాన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, వేల్పూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ కొట్టాల చిన్నారెడ్డి, వేల్పూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బోధన్‌టౌన్(బోధన్): సైబర్ నేరాలపై రిటైర్డ్ ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని పట్టణ సీఐ వెంకట నారాయణ స్పష్టం చేశారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులకు ఎటువంటి బ్యాంక్ వివరాలను ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేశ్వర్ రావు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రవికిరణ్, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ



వర్ని: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారమే లక్ష్యంగా ఓట్ల చోరీకి పాల్పడుతుందని వర్ని మార్కెట్ కమిటీ అధ్యక్షులు సురేష్ బాబా ఆరోపించారు. గురువారం వర్ని మండల కేంద్రంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. పీసీసీ డెలిగేట్ కునిపూర్ రాజిరెడ్డి, జాకోరా సొసైటీ చైర్మన్ దశరథ్, మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మైనారిటీ నాయకులు భారీ, గఫార్, మాజీ జెడ్పీటీసీ రజ్యా నాయక్, వర్ని సొసైటీ మాజీ అధ్యక్షులు వీర్రాజు, కిషన్, రాములు, రాజు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



మోస్రాలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్



దూపల్లిలో .. ప్రారంభిస్తున్న ఏపీఎం మోహన్

వర్ని/రెంజల్ : కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మోస్రా తహసీల్దార్ రాజశేఖర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రెంజల్ మండలం బాగేపల్లి, కూనేపల్లి, దండిగుట్ట, దూపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం మోహన్ ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఐకెపి ఏపీఎం గంగాధర్, పంచాయితీ కార్యదర్శి శ్రావణ్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీలా, సీసీలు కృష్ణ, శివకుమార్, శ్యామల, భాస్కర్, పోశెట్టి, మణిలతో పాటు ఆయా గ్రామాల వీవో అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

మంథనిలో పొలంబాట



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో గురువారం విద్యుత్ శాఖ సిబ్బంది పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సిబ్బంది వ్యవసాయ క్షేత్రాల్లో వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేశారు. కొత్తవి విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేశారు. ఏఈ శ్రవణ్, లైన్ ఇన్‌స్పెక్టర్ ముజీబ్, లైన్‌మన్ , తదితరులున్నారు.

వారణాసిలో మణికంఠ శివాచార్యులకు సత్కారం



యూపీ గవర్నర్ ఆనందీబెన్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మణికంఠ శివాచార్యులు

బోధన్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం నిర్వహించిన వేదాంత ఆచార్య జాతీయ పరీక్షలో బోధన్ వాసి మహారాష్ట్ర ప్రాంతంలోని లాతూరు జిల్లాలో గల లక్ష్మీదహివడి బార్సీ త్రిమఠాధిపతి గురుసిద్ధ మణికంఠ శివాచార్యులు ప్రతిభ కనబరిచి తొలి ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. గురువారం వారణాసిలోని ఆ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఉత్సవాల్లో గురుసిద్ధ మణికంఠ శివాచార్యులకు ఆ రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ చేతుల మీదుగా మూడు స్వర్ణ పతాకాలు, ప్రశంసా పత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం కాశీ జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్యుల వద్దకు వెళ్లి ఆశీస్సులు పొందారు.

కాన్షీరామ్‌కు నివాళి



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం కాన్షీరామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు రాజన్న, ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ రా ష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్ , బహుజన్ సమాజ్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షులు బోర్రోళ్ల సురేష్ ,జిల్లా మానిటరింగ్ కమిటీ మాజీ మెంబర్ కొమనపల్లి రాజన్న , దళిత సంఘాల నేతల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నందిపేట డొంకేశ్వర్ మండలాల దళిత నాయకులు సుంకరి నాగరాజు, ఎర్రటి మోహన్, బ్యాగరి జీవన్, బుడ్డ శివ బొర్రన్న, బండి రవీందర్, రాజు, ముఖేష్, రంజిత్, భాస్కర్, రాహుల్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో వీరభద్రీయ కులస్తుల చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తాజా మాజీ ఎంపీపీ శ్రీనివాస్

బోధన్: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన సంచార సామాజిక వర్గానికి చెందిన వీరభద్రీయ కులస్తులు మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరాం వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. కాంగ్రెస్ పాలనతీరుపై విరక్తితో వీరభద్రీయ కులస్తులు వంద మందికి పైగా బీఆర్ఎస్‌పై నమ్మకంతో పార్టీలో చేరారని మాజీ ఎంపీపీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన పెంపొందించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ప్రభుత్వ వివిధ శాఖల అధికారులకు సూచించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో సబ్ కలెక్టర్ మాట్లాడారు. సుపరిపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, పారదర్శకత సమాచార హక్కు చట్టం లక్ష్యంగా ఉందన్నారు. ఆయా శాఖల సమాచార హక్కు చట్టం అప్పీలు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

వర్ని: ఎంపీటీసీ ఎన్నికలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశించారు. గురువారం వర్ని మండల కేంద్రంలో ఎంపీటీసీల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్నికల్లో అక్రమాలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా ఎవరికైనా అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తే వారిపై ఎన్నికల కమిషన్ శాఖ పరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. మండల ప్రత్యేక అధికారి మధుసూదన్ ,రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్, ఎంపీవో మారుతి పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



మార్చ్‌పాస్ట్‌లో ప్రథమ బహుమతి అందుకుంటున్న రుద్రూర్ బాలుర హైస్కూల్ విద్యార్థులు

రుద్రూర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ తారాబాయి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహద పడుతాయని, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల నిర్వహణకు ఆర్థిక సహకారాన్ని అందించిన ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు రాము సేట్‌ను స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా స్థాయి క్రీడ పోటీలు రుద్రూర్‌లో ఏర్పాటు చేస్తే తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌పాస్ట్‌లో రుద్రూర్ బాలుర హైస్కూల్ ప్రథమ, కేజీబీవీ ద్వితీయ స్థానాల్లో నిలిచి మోమెంటోను అందుకున్నాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారి కట్ట శ్రీనివాస్, జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ పవన్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి మండల అధ్యక్షుడు విఠల్ రెడ్డి, తపస్ రాష్ట్ర బాధ్యులు కర్నె శంకర్, తపస్ మండల అధ్యక్షుడు గోనె శంకర్ , వివిధ పాఠశాల హెడ్‌మాస్టర్‌లు, ఫిజికల్ డైరక్టర్లు పాల్గొన్నారు.

ధాన్యం బోనస్ అవినీతిపై సమగ్ర విచారణ చేయాలి

- ప్రస్తుతం విచారణ చేస్తున్న అధికారిని మార్చాలి
- కోటగిరిలో బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రూర్ : కోటగిరి మండలంలో జరిగిన ధాన్యం బోనస్ అవినీతిపై సమగ్ర విచారణ జరిపించి బోగస్ వ్యక్తులు పొందిన డబ్బులు రికవరీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విచారణ పూర్తి చేయడంలో నెలల తరబడి జాప్యం చేస్తున్న విచారణ అధికారిని మార్చి సమర్థవంతమైన అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులకు చెందాల్సిన బోనస్ డబ్బులను కొందరు మాజీ ప్రజాప్రతినిధులు కాజేయడం సిగ్గు చేటని అన్నారు. త్వరగా విచారణ పూర్తి చేయాలని అవినీతి వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. అర్హులైన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తెల్ల రవికుమార్, వల్లేపల్లి శ్రీనివాస్‌రావ్, మోరె కిషన్, సమీర్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థతతో ఇబ్బందులు



రుద్రూర్‌లో మాట్లాడుతున్న హరికృష్ణ

రుద్రూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారని మండల బీజేపీ అధ్యక్షుడు అలపాటి హరి కృష్ణ విమర్శించారు. రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పరాజయం పాలవుతామని తెలిసి కాంగ్రెస్ ప్రభుత్వండ్రామా ఆడిందన్నారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రశాంత్ గౌడ్, పార్టీ మండల నాయకులు వై. గజేందర్, వి. రామరాజు, పార్వతి మురళి, మహిపాల్ అనిల్, సతీష్, బాబు రావ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై చిత్తశుద్ధి లేదు

నవీపేట : స్థానిక ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ జిల్లా నాయకులు తెడ్డు పోశెట్టి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 41 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జారీచేసిన జీవో నెంబర్ 9ని రద్దు చేయాలని దాఖలైన పిటిషన్ పై ప్రభుత్వం కోర్టులో సరైన వాదనలు వినిపించ లేదన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



గెలుచుకున్న బహుమతులతో విద్యార్థులు

వేల్పూర్ : వేల్పూర్ మండలం పడగల్ ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మ్యాక శ్రీకాంత్, కార్యదర్శి నారాయణగౌడ్, కోశాధికారి విజయానంద్, ప్రధానకార్యదర్శి పృథ్వీరాజ్, సీనియర్ సభ్యుడు వెంకట్రాంరెడ్డి, హెచ్ఎం రాంచందర్, టీచర్లు నారాయణ, జలంధర్, శంకర్, రాంచందర్, సుమలత, పీఈటి రాజేశ్వర్, గోదావరి, శకుంతల, శ్రీవాణి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గంIIల నుండి రాత్రి 8.00 గంIIల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
: 9010585333
: 9849180004
: 9966956559
: 7893150102
: 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899